సాక్షి
జనగామ
సోమవారం । 14 । జూలై । 2025



ప్రజల చైతన్యంతోనే ఆర్థిక వ్యవస్థ బాగు

ప్రజల చైతన్యం, రాజకీయ వ్యవస్థలో మార్పుతోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. - 8లో▸



మట్టిపాత్రలతో ఆరోగ్యమస్తు

మట్టిపాత్రలకు మార్కెట్‌లో డిమాండ్ బాగా పెరిగింది. రుచి, ఆరోగ్యం, ఎక్కువకాలం నిల్వ సామర్థ్యం ఉండటంతో ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 / 26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. పలుచోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చెక్‌డ్యాంలలో నీళ్లు నింపాలని నిరసన



జనగామ రూరల్: వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాలు అడుగంటి వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండి పోతున్నాయని, దేవాదుల ద్వారా చెరువులు, చెక్ డ్యాంలను నింపి ఆదుకోవాలని కోరుతూ జనగామ మండలం చీటకోడూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆదివారం నిరసన తెలిపారు. చీటకోడూరు–యశ్వంతాపూర్ వాగుపై నిర్మాణం చేసిన చెక్ డ్యాంల్లో చుక్క నీరు లేక మోడు బారిపోయాయన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి దేవాదుల నీటిని విడుదల చేయని పక్షంలో సాగు చేసిన పంటలు చేతికి రాకుండా పోతాయని రైతులు బాల్నె ఉమాపతి, గొల్లూరి యాదగిరి, ఎర్ర రవి, గండి సుభాష్, మంగ రాములు, కొత్త సుదర్శన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎండుతున్న పంటల పరిస్థితిని చూసి కలెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వర స్వామిని ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి హరీశ్ శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. గైడ్ కుమార్ ఆలయ విశిష్టత గురించి పర్యాటకులకు వివరించారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు అర్హత పరీక్ష

కేయూ క్యాంపస్: సివిల్ సర్వీస్ ఉచిత శిక్షణకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. ఉదయం 10–30 నుంచి మధ్యాహ్నం 1–30 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 440 మంది అభ్యర్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి, షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ సెల్ గౌరవ డైరెక్టర్ డాక్టర్ జగన్మోహన్ తెలిపారు. పరీక్షల నిర్వహణ తీరును ఎస్సీ వెల్ఫేర్ అధికారి బి.నిర్మల, కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రమాదేవి పరిశీలించారు.

ముగిసిన 'సకల కళల సంబురాలు'



హన్మకొండ కల్చరల్: తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో.. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం రెండు రోజుల పాటు నిర్వహించిన సకల కళలు సంబురాల జాతర–25 కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఉదయం వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో జరిగిన చివరి రోజు కార్యక్రమాల్లో భాగంగా 33 జిల్లాల నుంచి పలు కళారంగాల్లో నిష్ణాతులైన కళాకారులు, కళాబృందాలు హాజరై ప్రదర్శనలిచ్చారు. జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ నిర్వాహకులు జడల శివ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యాపారవేత్త ఆడెపు రవీందర్, జ్యూరీ, చీఫ్ కో–ఆర్డినేటర్ టీవీ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్వాహకులు జడల శివ, హరిత దంపతులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదానం చేశారు. కళాకారులు సకల కళలు సంబరాల జాతర కార్యక్రమంలో భాగంగా చిన్నారుల కూచిపూడి నృత్యాలు, జానపద నృత్యాలు, ఒగ్గుకథ, బుర్రకథ, నాటకాలు ప్రేక్షకులను అలరించాయి. పాల్గొన్న కళాకారులకు ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం జడల శివ మాట్లాడుతూ.. కళాకారులకు ప్రభుత్వం నుంచి గుర్తింపు, సహాయం అందాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద కళాకారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అనుమాండ్ల మధుకర్, మంచిర్యాల జిల్లా నాట్య కళాకారులు సమాఖ్య రాకం సంతోశ్, కోశాధికారి రామగిరి అర్జున్, పీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్డులొచ్చేస్తున్నాయ్

- నేడు సూర్యాపేటలో ప్రారంభించనున్న సీఎం
- జిల్లాలో 2,096 కొత్తరేషన్ కార్డులు
- కొత్తగా 28,967 కుటుంబ సభ్యుల చేరిక
- ప్రతీ నెల 3,221,188 మెట్రిక్ టన్నుల కోటా





జనగామ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన నిరుపేదలందరికీ కొత్త రేషన్ కార్డులను ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారు. ప్రజా పాలనతో పాటు మీసేవలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాల ఎదురుచూపులకు కొద్ది గంటలే మిగిలిఉంది. నేడు (సోమవారం) సూర్యాపేటలో జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సుదీర్ఘ కాలం పాటు తెల్లరేషన్ కార్డు లేక ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ బియ్యంకు దూరంగా ఉన్న వారంతా.. సెప్టెంబర్ మాసం నుంచి రేషన్ ఉచిత బియ్యాన్ని పొందనున్నారు. జిల్లాలో కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నారు.

న్యూ రేషన్ కార్డులు 2,096

జిల్లాలో కొత్త రేషన్ కార్డులు 2,096 మందికి వచ్చాయి. ప్రజా పాలనతో పాటు మీసేవలో దరఖాస్తు చేసుకోగా ఎంక్వరీ తర్వాత వీటిని అప్రూవల్ చేశారు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో తమ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోగా, అధికారికంగా నేటి (సోమవారం) అందుకోనున్నారు. కొత్త రేషన్ కార్డులతో పాటు గతంలో కార్డులు ఉండి, తమ పిల్లలు, ఇతర కుటుంబ సభ్యుల చేరికకు ఏళ్ల తరబడి నిరీక్షించారు. న్యూ రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో పిల్లల చేరికకు సైతం అవకాశం ఇవ్వగా, రెండు కలిపి 28,967 మంది (యూనిట్స్) కొత్తగా చేరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జూన్ మాసంలో మూడు నెలల బియ్యం కోటా ఒకేసారి ఇవ్వగా.. కొత్తగా రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులకు మాత్రం ఈ ఏడాది సెప్టెంబర్ మాసం నుంచి ఉచిత బియ్యం అందనున్నాయి. ఇదిలా ఉండగా ఒంటరి మహిళలు, ఆదరణ లేని అత్యంత దయనీయ స్థితిలో ఉన్న నిరుపేదలకు అంత్యోదయ (35 కిలోల బియ్యం), అన్నపూర్ణ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారికి భరోసా కల్పించే విధంగా మంజూరీ చేయాలని ప్రభుత్వాన్ని బాధిత కుటుంబాలు కోరుతున్నారు.

జిల్లాలో 335 రేషన్ దుకాణాలు

జిల్లాలో 335 రేషన్ షాపులు ఉన్నాయి. పాత, కొత్త రేషన్ కార్డులు కలుపుకుని 1,63,283కు పెరగగా, 5,06,722 మంది ఉచిత బియ్యం పొందుతున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నెలవారి కోట సన్న బియ్యం 3,221.188 మెట్రిక్ టన్నులను పెంచింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి న్యూ రేషన్ కార్డుల కోసం వేలాది కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నారు. 2020లో కొంత మంది అర్హులైన నిరుపేదలకు కొత్త కార్డులను అందించి తిరిగి నిలిపివేశారు.

జిల్లాలో రేషన్ సమాచారం

రేషన్‌షాపులు	తెల్లరేషన్	అంత్యోదయ
335	1,52,445	10,748
అన్నపూర్ణ	**మొత్తంకార్డులు**	**యూనిట్స్**
90	1,63,283	5,06,722
బియ్యంకోట		**కొత్త కార్డులు**
3,221,188 (మెట్రిక్‌టన్నులు)		2,096

ఇన్నాళ్లకు న్యూ రేషన్ కార్డులు రానుండడంతో పేదోళ్ల కుటుంబాల్లో వెలుగులు కనిపిస్తున్నాయి.

ఆరేళ్ల ఎదురుచూపులకు మోక్షం..



ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు. భర్త ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొత్త రేషన్ కార్డు కోసం అనేక సార్లు అర్జీ పెట్టుకున్నా రాలేదు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఉచిత రేషన్ బియ్యం పొందలేకపోయాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన కొన్ని పథకాలు కూడా అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త తెల్ల రేషన్ కార్డు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది.

- తాళ్లపల్లి మానస, గృహిణి, చిన్న పెండ్యాల, చిల్పూరు

పాలకుర్తి టౌన్: మంచుప్పలలో బోనాలతో వెళ్తున్న మహిళలు



వైభవంగా బోనాలు

పాలకుర్తి టౌన్ : మండలంలోని మంచుప్పల గ్రామంలో ఆదివారం మారమ్మ, మహంకాళి అమ్మ వార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో వైభవంగా బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

దేవరుప్పుల : ఆషాఢం సందర్భంగా మండలంలోని గొల్లపల్లిలో ఆదివారం మహంకాళి, మారమ్మలకు యాదవ కులస్తులు నజర్ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఒగ్గు కళాకారుల ఆటపాట, శివసత్తుల పూనకాలతో ఇంటింటా మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. గ్రామంలో వర్షాలు సమృద్ధి కురవాలని, పాడిపంటలు పండాలని భక్తులు మొక్కుకున్నారు. పెద్ద గొల్ల దూదిమెట్ల సోమలింగం, బయన్న, వర్రె కొమురయ్య, మాజీ సర్పంచ్ కోనేటి సుభాషిని నర్సయ్య, యాకన్న, తీగల వెంకన్న, తీగల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



దేవరుప్పల : గొల్లపల్లిలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు

నేటి నుంచి చండీ కుబేర పాశుపత యాగం

జనగామ: హైదరాబాద్ కాచిగూడ తుల్జాభవన్ ధర్మశాలలో నేటి (సోమవారం) నుంచి ఈ నెల 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు దూప, దీప నైవేద్య అర్చకుల సహకారంతో పంచకుండాత్మక చండీ కుబేర పాశుపత యాగం నిర్వహించడం జరుగుతుందని దూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధికారి ప్రతినిధి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సర్వతోముఖాభివృద్ధితో పాటు ప్రజలు, పాలకులు, కర్షకులు, కార్మికులు, పాడి పంటలు, ఆయురారోగ్య, ఐశ్వర్యాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ గ్రామీణ ప్రాంతంలోని అర్చకుల ఆమోదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉప్పలమ్మకు ప్రత్యేక పూజలు

జనగామ: ఆషాఢమాసం ఆదివారం పురస్కరించుకుని జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్ ఏరియా ఉప్పలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి వారనాసి పవన్‌శర్మ మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు, మహిళలు ఉప్పలమ్మ తల్లికి పట్టు వస్త్రాలు, కానుకలు సమర్పించి, చీర, సారె, పసుపు, కుంకుమతో ఒడిబియ్యం పోశారు. అనంతరం మహిళలు ప్రత్యేక పూజలు చేసి, వాసవీ చరిత్రను పారాయణం చేశారు.



పూజలో పాల్గొన్న మహిళలు

అంతర్జాతీయ దివ్యాంగ క్రీడాకారిణికి ఆర్థికసాయం

జనగామ: ప్రతిభ ఉంటే అంగ వైకల్యం సైతం అడ్డురాదని నిరూపించారు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాథపురంకు చెందిన దివ్యాంగురాలు మాచర్ల కృషివేణి. చిన్నతనం నుంచి ఎన్నో కష్టాలు ఎదురీదుతూ విజయ తీరాలకు చేరుకున్న ఆ క్రీడాకారిణి.. ముందడుగు వేయాలంటే ఆర్థిక వనరులు అడ్డువస్తూనే ఉన్నాయి. మనసున్న దాతల సహాయంతో దేశ, విదేశాల్లో జరిగే క్రీడాపోటీల్లో తన సత్తాను నిరూపించుకుంటున్నారు కృష్ణవేణి. ఈ నెల 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు మలేషియాలో జరుగనున్న ఏషియన్ పేరా టైక్వాండో గేమ్స్‌కు భారత దేశం తరపున కృష్ణవేణి అర్హత సాధించారు. జిల్లా, రాష్ట్రం, దేశంలో ఎన్నో పతకాలను సొంతం చేసుకున్న ఆమెకు...మలేషియా పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక పరిస్థితులు అడ్డొస్తున్నాయి. కనీసం విమాన చార్జీలు సైతం లేని దయనీయ పరిస్థితుల్లో మానవతా వాదుల సహకారాన్ని కోరుతున్నారు. కృష్ణవేణి టాలెంట్‌ను చూసిన తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దం రాజుగౌడ్ వెంటనే కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రతినిధులతో పాటు సంఘ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలకు ఈ విషయాన్ని చేరవేశారు. ఎన్ఆర్ఐ డాక్టర్ అతికం గిరిగౌడ్, డాక్టర్ అతికం శ్రీనివాస్‌గౌడ్‌లు నాతి గణేష్ ద్వారా రూ.1.50 లక్షలు, గౌడ ప్రముఖులు మరో రూ.30వేలను ప్రకటించారు. ఆదివారం పట్టణంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో దివ్యాంగురాలు మాచర్ల కృష్ణవేణిని శాలువాతో సత్కరించి, నగదుకు సంబంధించి చెక్కులను అందించారు. ఇందులో కరాటే కోచ్ అబ్బాస్, గోపగోని సుగుణాకర్, చిలువేరు అభిగౌడ్, బూడిది గోపి, వెంకట మల్లయ్య, దూడల సిద్దయ్య, బైరగోని మల్లేశం, తాళ్లపల్లి రాజుగౌడ్, చీకట్ల నవీన్‌గౌడ్ దూడల రాజాసంపత్ గౌడ్ ఆర్థిక సాయం చేసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బండకింది అరుణ్ కుమార్, కమ్మగారి నాగన్న, మహేందర్, బొల్లపల్లి విశ్వనాథ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



కృష్ణవేణికి చెక్కు అందజేస్తున్న నాయకులు

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్యవైశ్యులు వాణిజ్య, వ్యాపారాలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని మా గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణిస్తూ తమ సత్తా చాటాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు ఉన్న చోట పోటీ చేయాలన్నారు. ఆర్యవైశ్యులు కేవలం వాణిజ్య, వ్యాపారాలకే పరిమితం కాకుండా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, రానున్న రోజుల్లో రాజకీయాల్లోనూ సత్తా చాటాలన్నారు. ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్ను నర్సింహులు, నాయకులు బెలిదె వెంకన్న, పార్శి కమల్‌కుమార్, బెజుగం భిక్షపతి, తెల్లాకుల రామకృష్ణ, పార్శి రంగారావు, గౌరిశెట్టి శ్రీనివాస్, పాలకుర్తి సోమశేఖర్, పాలకుర్తి శ్రీనివాస్, జొన్నల రాజేశ్వరరావు, సరాబు ఆంజనేయులు, రవీందర్, వరూధిని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్

ఆలోచింపజేసిన 'బుద్ధుడితో నా ప్రయాణం'

హన్మకొండ: బుద్ధుడితో నా ప్రయాణం నాటక ప్రదర్శన ఆలోచింపజేసింది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం నృత్య రూప నాటకాన్ని ప్రదర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ రాసిన బుద్ధుడు ఆయన ధర్మం పుస్తకం ఆధారంగా రూపొందించిన నాటక ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పరంధాములు, లలిత ఫౌండేషన్ చైర్మన్ కేకే రాజా, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధుని బోధనల అవసరం ఉందని అన్నారు. భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క సుదర్శన్, పీఎస్ఎన్ మూర్తి, సిద్ధోజీరావు, నల్ల సూర్యప్రకాశ్, బొమ్మల్ల అంబేద్కర్, రౌతు రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌పీసీలో మూడో స్థానం

- పర్యావరణ సమతుల్యతలో విద్యార్థుల భాగస్వామ్యం
- భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక కార్యక్రమం
- కలెక్టర్ కృషితో ఉత్సాహంగా మొక్కలు నాటడం, ఇంకుడుగుంతల నిర్మాణం



కేజీబీవీలో ఇంకుడు గుంతను నిర్మిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



కలెక్టరేట్‌లో ఇంకుడుగుంత నిర్మాణంలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా (ఫైల్)

జనగామ రూరల్: జాతీయ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 3 రకాల అంశాలపై రాష్ట్రాలకు కాంపిటీషన్ పోటీలు నిర్వహిస్తుంది. నేషనల్ స్టూడెంట్ పార్టీ స్పెషల్ కాంపిటీషన్ (ఎన్ఎస్‌పీసీ)లో ముఖ్యంగా చెత్త నిర్వహణ, మొక్కల పెంపుదల, భూగర్భ జలాల పెంపుదలపై పోటీలు నిర్వహిస్తుంది. ఈ పోటీలో రాష్ట్రం, దేశంలో రెండవ స్థానంలో ఉండగా రాష్ట్రంలో జనగామ జిల్లా 3వ స్థానంలో ఉంది. ప్రజారోగ్యం, పరిశుభ్రత అనే మూడవ కీలక అంశంపై కూడా ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి పోటీల్లో పాల్గొనేలా చేయడం ద్వారా విద్యాలయాలు, వసతి ప్రాంతాల్లో హైజీన్, వేస్ట్ మేనేజ్‌మెంట్, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరుస్తూ, కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించేందుకు కలెక్టర్ రిజ్వాన్ బాషా జిల్లా వ్యాప్తంగా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా 'మన జిల్లా మన నీరు' అనే కార్యక్రమంతో వివిధ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఐదువేల ఇంకుడు ఇంతల నిర్మాణాలకు ప్రణాళిక చేపట్టారు. అదే సమయంలో వనమహోత్సవం కార్యక్రమం కింద వేలాది మొక్కలు నాటుతున్నారు.

విద్యార్థుల భాగస్వామ్యం..

విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, జీవనశైలిని పెంపొందించాలని, మొక్కలు నాటటం, నీటి సంరక్షణ, వ్యర్థాలను వేరుచేసే అలవాట్లను విద్యార్థులకు పెంపొందించడానికి నేషనల్ గ్రీన్ కోర్ తయారు చేసిన నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీలు జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో కేజీబీవీలు, సోషల్ వెల్ఫేర్‌లు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఎక్కువగా పాల్గొంటున్నారు.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్

జూలై 1 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ పోటీలు కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో నిర్వహిస్తుండగా ఫలితాలు ఆగస్టు 30న ప్రకటించనున్నారు. 1వ తరగతి నుంచి పరిశోధన విద్యార్థుల వరకు ఐదు విభాగాల్లో పోటీ నిర్వహిస్తారు. ఎకో మిత్రం అప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని, హిందీ, ఇంగ్లిష్ మరిన్ని భాషల్లో క్విజ్ ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. మొక్క నాటుతున్న, నీరు సేవ్ చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీ ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 1వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులతో పాటు సామాన్య పౌరులు కూడా పాల్గొనవచ్చు. పోటీలో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి వెంటనే ఈ–సర్టిఫికెట్ లభిస్తుంది. విద్యా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు ఇస్తారు.

పర్యావరణ సమతుల్యతకు కృషి చేయాలి



జాతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్‌పీసీ పోటీలో రాష్ట్రంలో 3వ స్థానంలో నిలువగా ఆగస్టు 31 వరకు గడువు ఉంది. అన్నివర్గాల ప్రజల సహకారంతో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తాం. భూగర్భజలాలు సంరక్షించి వర్షపు నీటిని ఒడిసి పట్టి భవిష్యత్ తరాలకు అందించాలి. విద్యార్థులు ప్రతిఒక్కరూ పరిశుభ్రతపై బాధ్యతగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. విరివిగా మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతకు కృషి చేయాలి.

- రిజ్వాన్ బాషా, కలెక్టర్

ప్రసాద్‌శర్మకు సిద్ధాంతి సరస్వతి బిరుదు



నరసరావుపేటలో ప్రసాద్‌శర్మకు పురస్కారం అందిస్తున్న ఇంద్రగంటి ప్రసాద్, తదితరులు

దేవరుప్పుల : మండలంలోని వాసవీమాత ఆలయ అర్చకుడు డాక్టర్ అవసరాల ప్రసాద్‌శర్మకు సిద్ధాంతి సరస్వతి బిరుదుతోపాటు అరుదైన పురస్కారం లభించింది. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేటలో అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న పంచాంగ సిద్ధాంతుల ప్రసాద్‌శర్మకు సిద్ధాంత సరస్వతి బిరుదుతో పాటు శ్రీగురు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు ఇంద్రగంటి ప్రసాద్, బుట్టివారు, నిట్టల కృష్ణ ప్రసాద్, ప్రముఖ పంచాంగ కర్తలు ఉన్నారు.

రోడ్డు పనులకు ఆటంకం కలిగిస్తే ధర్నా చేస్తాం

- కంచనపల్లి రైతులు


రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి రెడ్డి కాలనీ నుంచి భాంజీపేట వెళ్లేదారిపై చేపట్టిన మట్టి రోడ్డు పనులకు ఆటంకం కలిగించే వారి ఇళ్ల ముందు ధర్నా చేస్తామని గ్రామ రైతులు హెచ్చరించారు. రోడ్డు పనులకు కొందరు అడ్డంకులు కలిగిస్తుండటంపై ఆదివారం గాదె జయపాల్ అధ్యక్షతన బాధిత రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామం నుంచి వ్యవసాయ బావులకు వెళ్లే భాంజీపేట దారికి రోడ్డు కావాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరికి విజ్ఞప్తి చేయగా ఆయన వెంటనే స్పందించి ఈజీఎస్‌లో రోడ్డు పనులు చేయించారు. మట్టిపై నడిచే పరిస్థితి లేక.. సమస్య ఎమ్మెల్యేకు విన్నవించగా ఆయన వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి మొరం పోసుకోవడానికి అనుమతి ఇచ్చారు. 750 ట్రిప్పులకు పర్మిషన్ పొంది ఎకరా చొప్పున తామే నిధులు సమకూర్చుకొని 350 ట్రిప్పులు మాత్రమే మొరం పోసుకున్నామని.. గ్రామానికి సంబంధం లేని వ్యక్తులు అధికారులకు ఫిర్యాదు చేసి పనులు నిలిపివేయించారన్నారు. స్వచ్ఛందంగా రోడ్డు పనులు చేసుకుంటున్న రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోలు రామ్మూర్తి, ఓరుగంటి మనోహర్, చిన్నపురెడ్డి, కిరణ్‌రెడ్డి, రాజారెడ్డి, జోజిరెడ్డి, దినేష్‌రెడ్డి, శౌరెడ్డి తదితరులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు

వరినారు ఎండుతోంది..

బచ్చన్నపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పొలంలో వేసిన వరినారు ఎండిపోతుంది. నాటు వేసేందుకు దమ్ముచేసిన పొలాలు కూడా ఎండిపోతున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన కామిడి శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డితో పాటు పలువురు రైతులు మాట్లాడుతూ..వర్షాలు కురవక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి నాటు వేసిన వరిపొలం ఎండిపోతున్నాయని తెలిపారు. గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపకపోతే మిగిలిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు చొరవ చూపి చెరువులు, కుంటలను నింపాలని కోరారు.



బచ్చన్నపేటలో ఎండిన వరిపొలం

అంతర్జాతీయ బ్లైండ్ గోల్‌బాల్ పోటీలకు సాయితేజ


సాయితేజ

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండ మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన పెండెల సాయితేజ అంతర్జాతీయ బ్లైండ్ గోల్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇండియన్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్నట్లు కోచ్ శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 2025న ఈజిప్టులో జరగనున్న అంతర్జాతీయ బ్లైండ్ గోల్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా, సమ్మేళిత ఫౌండేషన్.. ఎంపికైన జాతీయ జట్టు క్రీడాకారులకు వసతులు అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సివిల్స్ శిక్షణ పొందుతున్న సాయితేజ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్య


రాజశ్రీ దేవి(ఫైల్)

వర్ధన్నపేట: కడుపు నొప్పి భరించలేక ఓ బాలిక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పట్టణంలోని పిరంగడ్డ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఎస్సై బండారి రాజు కథనం ప్రకారం..పిరంగడ్డకు చెందిన రాజబోయిన ఎల్లయ్య కూతురు రాజశ్రీ దేవి(15) కొంత కాల క్రితం కడుపు నొప్పికి చికిత్స పొందింది. అయినా తగ్గడం లేదు. ఈ క్రమంలో నాలుగు రోజులుగా నొప్పి ఎక్కువ అయ్యింది. దీంతో ఆదివారం కుటుంబీకులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి రాజబోయిన ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

వ్యవసాయ భూమి ఇవ్వాలని..

- రైతుపై హత్యాయత్నం


మహబూబాబాద్ రూరల్ : ఓ రైతు సొంత వ్యవసాయ భూమిని తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అతడి అన్న కుమారులు దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ మండలం సాధు తండా గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. సాధు తండా గ్రామానికి చెందిన రైతు బానోత్ బాబుకు మూడు ఎకరాల మూడు గుంటల వ్యవసాయ భూమి ఉండగా అతడి పెద్ద కుమారుడు వీరన్న పేరున 37 గుంటలు ఉంది. ఇద్దరు రైతులకు సంబంధించిన భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో బానోత్ బాబు అన్న బానోత్ సామ్య పెద్ద కొడుకు హుస్సేన్, అతడి భార్య లక్ష్మి, కుమారుడు సాయి, చిన్న కొడుకు హతీరాం తదితరులు బాబు వ్యవసాయ భూమి తమకు ఇవ్వాలని కొంతకాలంగా ఘర్షణ పడుతున్నారు. తన సొంత భూమి ఎందుకు ఇస్తానని బాబు పేర్కొంటూ పలుమార్లు పెద్దమనుషుల్లో పంచాయితీలు కూడా నిర్వహించారు. అదేవిధంగా కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయగా వారిపై కేసులు నమోదయ్యాయి. అయినా బాబు వ్యవసాయ భూమిలో ఎకరం తమకు ఇవ్వాలని సామ్య కుమారులు కొంతకాలంగా గొడవలు పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం బాబు, అతడి చిన్న కుమారుడు భద్రు, కోడలు భూమిక తమ వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పనులు చేస్తుండగా హుస్సేన్, లక్ష్మి, సాయి, హతీరాం అక్కడికి వచ్చి గొడవకు దిగారు. అంతలోనే నాగలి కాణి తీసుకుని బాబుపై హత్యాయత్నం చేయగా అతడికి తీవ్రగాయాలయ్యాయి. భద్రు, భూమికకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. కాగా, భూమిక మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడు అపహరణకు గురైంది. ఈ ఘటనపై బాధితులు కురవి పీఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. తీవ్రగాయాలైన బాబును 108లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.



మట్టి పాత్రలతో ఆరోగ్యమస్తు..

- రుచితోపాటు ఆరోగ్యం
- మట్టి పాత్రలవైపు మళ్లుతున్న ప్రజలు
- వంట గదుల్లో గత వైభవం..







వివిధ రకాల మట్టి పాత్రలు

ఖిలా వరంగల్ : పూర్వం రోజుల్లో వంటలకు మట్టి పాత్రలనే వాడే వారు. అన్నం, కూర, పాలు, పెరుగు.. ఇలా ప్రతీ పదార్థం మట్టి కుండలోనే వండేవారు, భద్రపరిచేవారు. ఈ పాత్రల్లో వండిన, భోజనం చేసిన వారు ఎక్కువ కాలం ఆరోగ్యంతో జీవించేవారని పెద్దలు చెబుతుంటారు. అయితే పెరిగిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మట్టి పాత్రలు మాయమయ్యాయి. వాటి స్థానంలో అల్యూమినియం పాత్రలు, పేపర్ పేట్లు ప్రత్యక్షమయ్యాయి. ఫలితంగా వీటిని వినియోగించిన ప్రజలు అనారోగ్యాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ ప్రమాదాన్ని గ్రహించిన ప్రస్తుత తరం మట్టి పాత్రలపై మక్కువ చూపుతోంది. దీంతో ఏళ్ల క్రితం వదిలేసిన మట్టి పాత్రలు ప్రజలు మళ్లీ ఇంటికి తెచ్చుకుంటున్నారు. ఫలితంగా మార్కెట్‌లో మట్టి పాత్రలకు డిమాండ్ కనిపిస్తోంది. అయితే ఈ కాలంలో కూడా మట్టి పాత్రలను ఎవరు వాడతారనుకుంటే పొరపాటే.. వీటిని నేటికీ వినియోగించే వారు ఉన్నత వర్గాల్లో ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

రుచి..ఆరోగ్యకరం..

మట్టిపాత్రలో వంట రుచిగా ఉంటుంది. అలాగే, ఎక్కువ కాలం పాడవకుండా ఉంటుంది. మట్టి పాత్రలను తయారు చేసే బురద మట్టిని సిరామిక్ అంటారు. ఈ సిరామిక్‌కు వేడి తగలగానే ఇన్‌ఫ్రారెడ్ అనే కంటికి కనిపించని కిరణాలు ఉత్పత్తవుతాయి. ఈ కిరణాలు ప్రసరించిన ప్రాంతమంతా పూర్తిస్థాయిలో శుద్ధి అవుతుంది. ఉదాహరణకు పిల్లలు బలహీనంగా, తక్కువ బరువుతో పుట్టినా.. పుట్టుకతోనే అనారోగ్యంతో ఉన్నా ఇంక్యుబేటర్ అనే పరికరంలో (లైట్ కింద పెడతారు) కొన్ని గంటల పాటు ఉంచుతారు. ఆ పరికరంలో ఉండే లైట్ ద్వారా ఇన్‌ఫ్రారెడ్ కిరణాలను ప్రసరింపజేసి పుట్టిన పిల్లల శరీరాన్ని పూర్తిగా శుద్ధి చేస్తారు. కేవలం కొద్ది గంటల్లోనే శిశువులకు పూర్తి స్థాయిలో ఆరోగ్యాన్ని సరిచేయగల శక్తి ఈ కిరణాలకు ఉంది.

ప్రకృతి వైద్యంలో బురద స్నానం (మడ్ బాత్) గురించి తెలిసే ఉంటుంది. శరీరం నిండా బురద పూసి ఎండలో ఉంచుతారు. అందులో కూడా ఇవే కిరణాలు ఉత్పత్తి అయ్యి రోగి శరీరాన్ని శుద్ధి చేయడం ద్వారా వ్యాధి నుంచి విముక్తి లభిస్తుంది. అలాగే, మట్టి పాత్రల్లో వంట చేస్తే పురుగు మందుల అవశేషాలను పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేసి పదార్థంలోని పోషక విలువలను ఏమాత్రం వృథా కాకుండా చేయడమేకాక పోషకాలకు అదనపు శక్తిని కలిగించి ఆహారాన్ని సమతుల్యంగా మారుస్తాయి. అందుకే మట్టి పాత్రల్లో చేసిన వంటలకు ఎక్కువ రుచి, ఎక్కువ నిల్వ సామర్థ్యం ఉంటుంది.

లోహపాత్రల వల్లే రోగాలు..

అల్యూమినియం పాత్రలో వండిన పదార్థాలు విషతుల్యమవుతాయి. ఈ పదార్థలు తిన్న ప్రజలు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, కాలేయ సమస్యలు, క్యాన్సర్ వంటి జబ్బుల బారిన పడుతారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

మట్టి కడవల్లోనే మంచినీరు..

పూర్వకాలంలో మట్టి పాత్ర(కుండ)ల్లో వంటలు చేసే వారు. మట్టి కడవల్లోనే మంచినీరు తాగే వారు. అందుకే ఆ కాలపు వారు ఆరోగ్యంగా ఉండేవారు. అయితే 40 ఏళ్ల నుంచి మట్టి పాత్రలు వాడకం క్రమేనా తగ్గతూ వచ్చింది. ప్రస్తుతం వ్యాప్తిస్తున్న రోగాలతో పాతకాలం నాటి ఆహార పద్ధతులపై ప్రజలు మక్కువ పెంచుకుంటన్నారు. ఇందులో భాగంగా మట్టి కుండలో చికెన్, మట్టి పాత్రలో వంటలకు క్రేజ్ పెరుగుతోంది. మట్టి పాత్రల్లో వంటలు ఆరోగ్యకరం అనగానే ఆ పాత్రలు మార్కెట్‌లో భారీగా అమ్ముడవుతున్నాయి. గతంలో ఇళ్లలో మట్టితో తయారు చేసే వస్తువులు అనేకం ఉండేవి. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే కుండలు తప్ప మరే ఇతర మట్టి పాత్రలు కనిపించడం లేదు.

అందుబాటులో మట్టి టీ గ్లాస్, వాటర్ బాటిళ్లు..

తెలంగాణలోని ఆదిలాబాద్, గుజరాత్, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో గృహోపకర పాత్రలను మట్టితోనే తయారు చేస్తారు. ఇక్కడి నుంచే దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో కుమ్మరి కులస్తులు మట్టి పాత్రలు అందుబాటులో ఉంచారు. టీ గ్లాస్, వాటర్ బాటిల్, కంచాలు, స్పూన్లు.. ఇలా అన్ని రకాల మట్టి పాత్రలు అందుబాటులో ఉన్నాయి.

మట్టి పాత్రలే ముద్దు



అల్యూమినియం కంటే మట్టి పాత్రలే ముద్దు. తెలంగాణలో ఉగాది పచ్చడి కొత్త మట్టి కుండల్లో చేస్తారు. ఇలా చేయడం వల్ల మట్టి పాత్రల్లో ఉండే పోషకాలు నేరుగా శరీరంలోకి వెళ్తాయి. దీని వల్ల ఎలాంటి రోగాలు దరిచేరవు. పూరి జగన్నాథుడి ఆలయంలో ఇప్పటికీ మట్టి పాత్రల్లోనే ప్రసాదాలు తయారు చేసి పంపణీ చేస్తారు.

డాక్టర్ నరేశ్‌కుమార్, ఫోర్ట్ రోడ్డు వరంగల్

ఓరుగల్లుతో 'కోట'కు అనుబంధం

- అమ్మవారి దర్శనానికి వరంగల్‌కు వచ్చిన కోట శ్రీనివాసరావు
- ఆయన మృతితో దిగ్భ్రాంతి చెందిన ఉమ్మడి జిల్లా కళాకారులు

హన్మకొండ కల్చరల్: విలక్షణ నటులు కోట శ్రీనివాసరావు ఆదివారం మృతి చెందారు. ఆయన మృతిపై వరంగల్ నగరవాసులు దిగ్భ్రాంతి చెందారు. ఈసందర్భంగా వరంగల్ నగరవాసులు కోట శ్రీనివాసరావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కోట శ్రీనివాసరావు నాటక కళాకారులు కూడా కావడంతో కొన్నేళ్ల క్రితం కేఎంసీలో జరిగిన పోటీల్లో ఒక నాటకంలో కూడా ప్రదర్శన ఇచ్చారని కవి, సహృదయ సంస్థ సభ్యులు ఎన్వీఎన్ చారి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మృతిపై సహృదయ కార్యవర్గం, తెలంగాణ నాటక సమాజాల సమైక్య అధ్యక్షుడు ఆకుల సదానందం, అధ్యక్షుడు మాడిశెట్టి రమేశ్, సీనియర్ కళాకారులు కాజీపేట తిరుమలయ్య, జేఎస్ శర్మ, ఓడపల్లి చక్రపాణి, జూలూరు నాగరాజు, పలువురు కళాకారులు, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

'కోట' మరణం బాధాకరం



విలన్‌గా, కమెడియన్‌గా, తండ్రిపాత్రలో నటించి విలక్షణమైన నటుడిగా పేరు పొందిన కోట శ్రీనివాసరావు మరణం బాధాకరం. 1990లో లష్కర్‌బజార్ హైస్కూల్ జరిగిన ఓ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన సందర్భంగా పరిచయం చేసుకుని ఫొటో దిగా.

- మట్టెవాడ అజయ్‌కుమార్, మైక్రో ఆర్టిస్ట్, వరంగల్

చమత్కారంగా మాట్లాడేవారు..



డిసెంబర్ 2006లో జగపతిబాబు, ప్రియమణి హీరోహీరోయిన్లుగా నటించిన 'పెళ్లయిన కొత్తలో' సినిమాకు నేను ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా ఉన్నా. ఆ సందర్భంగా కోట శ్రీనివాసరావు గారితో కలిసి ఫొటో దిగా. ఆయన చమత్కారంగా మాట్లాడేవారు. 1989లో వరంగల్‌కు వచ్చిన కోట శ్రీనివాసరావు తన తమ్ముడు కోట శంకర్‌రావుతో కలిసి భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన వరంగల్ చౌరస్తాలోని ఊర్వశి హోటల్‌లో బస చేశారు. అక్కడి నుంచి ఆటోలో బయలుదేరి అమ్మవారిని దర్శించుకున్నారు. అప్పుడే మొదటిసారి కోట శ్రీనివాసరావును ఊర్వశి హోటల్‌లో కలిశా.

- ఆహో శ్రీనివాస్, ఆర్టీసీ డ్రైవర్ వరంగల్ -1డిపో, హనుమకొండ

అంబేడ్కర్ వర్సిటీలో డిగ్రీ అడ్మిషన్లకు గడువు

విద్యారణ్యపురి : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో 2025–2026 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకునేందుకు చివరి గడువు ఆగస్టు 13వ తేదీ అని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్, కోఆర్డినేటర్ అలువాల సంజీవయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాల్లో ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. డిగ్రీ కోర్సులు తదితర వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూఆన్‌లైన్ .ఇన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్‌లో చూడొచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లోనే ఫీజులు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా డిగ్రీ కోర్సుల్లో ద్వితీయ, తృతీయ సంవత్సరంలో ట్యూషన్ ఫీజు ఆగస్టు 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. వివరాలకు 7382929675 హెల్ప్ డెస్క్‌నంబర్‌ను సంప్రదించాలన్నారు.

భర్తతో ఉండేలా న్యాయం చేయండి

- మల్కాపూర్ ప్రజలరా మీకు పాదాభివందనం
- ఐదేళ్ల కూతురితో భర్త ఇంటి ఎదుట ఫ్లెక్సీతో భార్య నిరసన


భర్త ఇంటి ఎదుట కూర్చున్న తల్లిదండ్రులు, కూతురితో తేజస్విని

చిల్పూరు : భర్తతోనే (అతడి తల్లిదండ్రులు కాకుండా) కలిసి ఉండేలా తనకు న్యాయం చేయాలని ఓ ఇల్లాలు భర్త ఇంటి ఎదుట తన తల్లిదండ్రులు, ఐదేళ్ల కూతురితో కలిసి ఆదివారం నిరసన చేపట్టింది. మల్కాపూర్ గ్రామానికి చెందిన సాంబారి రాజేశ్వర్, మణెమ్మ దంపతులకు విద్యాసాగర్ ఒక్కడే కుమారుడు. ఆరేళ్ల క్రితం భూపాలపల్లి జిల్లా ములుగు ఘణపురం గ్రామానికి చెందిన వెంకటనారాయణ కుమార్తె తేజస్వినితో పెళ్లి జరిపించారు. దంపతులు కొంతకాలం క్రితం వరకు అన్యోన్యంగా ఉండేవారు. అయితే మల్కాపూర్ వచ్చిన నాటి నుంచి తేజస్వినిని ఏదో రకంగా అత్తామామ ఇబ్బంది పెట్టేవారు. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినా ఫలితం లేకపోవడంతో కోర్టు వరకు వెళ్లింది. అయినా విద్యాసాగర్ తల్లిదండ్రుల్లో ఎలాంటి మార్పు రాకపోవడంతో ఆదివారం తేజస్విని తన తల్లిదండ్రులతో పాటు కూతురితో కలిసి మల్కాపూర్ గ్రామానికి వచ్చింది. ఇంటి ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన చేపట్టింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై నవీన్‌కుమార్ ఆదేశంతో కానిస్టేబుల్ చారి అక్కడకు వెళ్లి గొడవ జరగకుండా చేశారు.

భార్య మృతి తట్టుకోలేక భర్త కన్నుమూత


నర్సమ్మ (ఫైల్)


చెన్నయ్య (ఫైల్)

చిల్పూరు: భార్య మృతి తట్టుకోలేక భర్త కన్నుమూశాడు. ఈ ఘటన ఆదివారం జనగామ జిల్లా చిల్పూరులో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన సట్ల చెన్నయ్య(85), నర్సమ్మ దంపతులకు సంతానం లేరు. సుధీర్‌ను దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. ఈ నెల 3వ తేదీన నర్సమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం ఆమె దశదిన కర్మ చేసేందుకు చెన్నయ్య కుటుంబ సభ్యులతో కలిసి శ్మశానవాటికకు వెళ్లాడు. కార్యక్రమం పూర్తయ్యాక ఇంటికి వచ్చేందుకు ఆటో ఎక్కి చనిపోయాడు. చెన్నయ్య మృతితో చిల్పూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి కాంగ్రెస్ నాయకులు జక్కం భాస్కర్, గణగోని రమేశ్, పొన్నం శ్రీను, కుమార్ తదితరులు సంతాపం ప్రకటించారు.

జగ్గన్నపేటలో తల్లి..

ములుగు రూరల్ : కూతురు మరణాన్ని తట్టుకోలేక తల్లి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని జగ్గన్నపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగ్గన్నపేటకు చెందిన గుండెకారి రాధమ్మ (72) కూతురు ఏరాబటి లక్ష్మి గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం కూతురు సంవత్సరీకం జరిగింది. కూతురు మరణాన్ని తలుచుకుంటూ మనస్తాపంలో రాధమ్మ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు యువరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

బొగతలో పర్యాటకుల సందడి..


జలపాతం వద్ద పర్యాటకులు

వాజేడు: మండల పరిధి చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతంలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. జలపాతం జలధారలను వీక్షించడంతో పాటు సెల్‌ఫోన్లలో బంధించారు. కొలనులో స్నానాలు చేస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగి సందడి చేశారు. నడచి వెళ్లలేని పర్యాటకుల కోసం రైడర్ వాహనం ఏర్పాటు చేసి జలపాతం వద్దకు తీసుకెళ్లారు.

ఎమ్మెస్సీ జియాలజీతో ఉపాధి అవకాశాలు



కేయూలోని జియాలజీ విభాగం

- కేయూ ఆ విభాగంలో ప్రత్యేకతలు
- డిగ్రీ ఏ సైన్స్‌లో ఉత్తీర్ణత పొందినా ప్రవేశానికి అర్హత
- సీపీగేట్‌కు దరఖాస్తులకు ఈనెల 17వరకు గడువు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎమ్మెస్సీ జియాలజీలో ప్రవేశాలు పొంది కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. క్యాంపస్‌లో 1989లో 12 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తూ ప్రారంభించిన జియాలజీ విభాగంలో ప్రస్తుతం 40 సీట్లకు పెంపుదల చేశారు. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో, స్వయం ఉపాధి సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వివిధ కంపెనీలు కూడా ప్రాంగణ నియామకాలతో ఎంపిక చేసుకుంటున్నాయి.

ఎమ్మెస్సీ జియాలజీలో ప్రవేశాలకు అర్హత పరీక్ష

ఎమ్మెస్సీ జియాలజీ కోర్సులో ప్రవేశాలకు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సులకు నిర్వహించే సీపీగేట్ -2025కు దరఖాస్తులు చేసుకోవాల్సింటుంది. దరఖాస్తులు చేసుకునేందుకు ఆసక్తి గల అభ్యర్థులకు ఈనెల 17వ తేదీవరకు గడువు ఉంది. ఎమ్మెసీ జియాలజీ కోర్సులో ప్రవేశాలకు డిగ్రీలోని ఏసైన్స్ విభాగంలోనైనా ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు అర్హులు. సీపీ గేట్ ప్రవేశపరీక్షలో ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తారు.

యువతకు ఉజ్వల భవిష్యత్



ఎమ్మెస్సీ జియాలజీ కోర్సు పూర్తి చేసిన యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంది. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉద్యోగాలున్నాయి. జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్‌వాటర్ బోర్డు, నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, అటామిక్ మినరల్ డివిజన్, నేషనల్ హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ కార్పొరేషన్ బోధన, పరిశోధన సంస్థల్లో ఉపాధి అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, రాష్ట్ర భూగర్భ జలశాఖ, డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్‌లో ఉద్యోగావకాశాలున్నాయి.

-ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, జియాలజీ విభాగం అధిపతి,కేయూ

ప్రజల చైతన్యంతోనే ఆర్థిక వ్యవస్థ బాగు

- గత పాలకుల విధానాలతో విద్య, వైద్య రంగాలు నాశనం
- ప్రొఫెసర్ హరగోపాల్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

హన్మకొండ: ప్రజల చైతన్యం, రాజకీయ వ్యవస్థలో మార్పుతోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగు పడుతుందని, రాష్ట్ర సమగ్రాభివద్ధి సాధ్యమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్ట హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో 'అప్పుల ఊబిలో తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ- కారణాలు, పర్యవసానాలు–ప్రస్తుత పరిష్కారాలు' అనే అంశంపై మేధావుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో హరగోపాల్ ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో గత పాలకుల విధానాల వల్ల విద్య, వైద్యం లాంటి మౌలిక రంగాలు నాశనమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల రాజకీయ చైతన్యంతో, రాజకీయ పార్టీల స్వభావంలో మార్పుతోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగుపడి సమగ్రాభివద్ధి జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి నాయకత్వం వహించిన కేసీఆర్ మేధావుల సూచనలను పట్టించుకున్న పాపాన పోలేదని, ఎవరి మాట వినలేదన్నారు. నేటి పాలకులు మేధావుల సూచనలు విన్నప్పటికి వాటి అమలుపై నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ అన్ని రకాలుగా ఆగమైన వర్గాలకు న్యాయం జరగాల్సిన అవసరముందన్నారు. దొరల పాలనలో తెలంగాణ మరింత ఆగమైందని, మానవాభివృద్ధితో కూడిన ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచించి అమలుపరచాలన్నారు. ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరిగినా కానీ ప్రజల మౌలిక సదుపాయాలు పెరగలేదన్నారు. హెదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్.వి.రమణమూర్తి మాట్లాడుతూ పంటల విధానంలో మార్పులు తెచ్చి వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇట్యాల పురుషోత్తం, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామ్మూర్తి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డాక్టర్ జిలకర శ్రీనివాస్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్ మోహన్ రావు ప్రసంగించారు. కార్యక్రమంలో వీరమల్ల బాబురావు, మల్లారెడ్డి, సంపత్ రెడ్డి, సుశీల, చాపర్తి కుమార్ గాడ్గే, డాక్టర్ ప్రవీణ్ కుమార్, బుసిగొండ ఓంకార్, వల్లాల జగన్ గౌడ్, సంఘని మల్లేశ్వర్, కొంగ వీరస్వామి, మేకల కేదారి యాదవ్, నలిగింటి చంద్రమౌళి, లంకా పాపిరెడ్డి, బొమ్మినేని పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని బిహార్ వాసి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్ : లారీ ఢీకొని బిహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ.హర్మన్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సీ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన హర్మన్ హనుమకొండలోని ఓ రబ్బర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. కాగా, ఆదివారం తెల్లవారుజామున స్టేషన్‌ఘన్‌పూర్‌లో జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా హనుమకొండ నుంచి జనగామ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో హర్మన్ అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం పలు వాహనాలు మృతదేహంపై నుంచి వెళ్లగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంపై సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

అమెరికా స్వప్రయోజనాల కోసమే యుద్ధాలు

- టీఎస్‌డీఎఫ్ రాష్ట్ర సదస్సులో వక్తలు



సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

న్యూశాయంపేట: అమెరికా స్వప్రయోజనాల కోసం జరుగుతున్న యుద్ధాలతో సమాజానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని వక్తలు పేర్కొన్నారు. 'యుద్ధాలు ఎవరి కోసం' అనే అంశంపై తెలంగాణ ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి అధ్యక్షతన ఆదివారం వరంగల్ అబ్నూస్ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ అధికార ప్రతినిధి జేవీ చలపతిరావు, సీపీఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యుడు గుర్రం విజయ్‌కుమార్ మాట్లాడారు. ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయించేందుకు, సంపద దోచుకునేందుకు దేశాల మధ్య అమెరికా యుద్ధాలను ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. ఈ క్రమంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు, వెనుకబడిన దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది ప్రాణాలు పోతున్నాయని, పర్యావరణం దెబ్బతింటున్నదని పేర్కొన్నారు. కోలుకోలేని విధంగా గాజా, ఇరాన్, పాలస్తీనా దేశాలు దెబ్బతిన్నాయని, అభంశుభం తెలియని పసికందులు, మహిళలు సైతం ప్రాణాలు కోల్పోయారన్నారు. అమెరికాకు భారత్ వత్తాసు పలకడం సిగ్గుచేటని, పాకిస్తాన్‌తో సయోధ్య కుదిర్చామని గొప్పలు చెబుతున్న ట్రంప్ ఇతర దేశాల మధ్య చిచ్చు ఎందుకు ఆపడం లేదని ప్రశించారు. అమెరికా ప్రయోజనాల కోసం, కార్పొరేట్ శక్తుల కోసం ప్రధాని మోదీ సాగిల పడడం ఆందోళన కలిగిస్తోందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అలాంటి ధోరణి మానుకోవాలని హెచ్చరించారు. దోపిడీ లేని రాజ్యం కోసం ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో నాయకులు పి.రమేశ్, ఎం.రవి, విశ్వనాథ్, ఆర్.బాలరాజు, ఎస్.అప్పారావు, యాదగిరి, ఇనాం అబ్దుల్‌అలీ జుబేర్, అబ్దుల్ సుభాన్, వి.రాగసుధ, జి.నాగార్జున, సావిత్రి, తదితర నాయకులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SPOKEN ENGLISH

- Spoken English for Teachers D.Ed / B.Ed / PGs. Results Guaranteed. Rs. 300/- @ BSS GEMS 9494447457, GARLA - Mahabubabad. [WA-6726]

SERVICES

- పద్మావతి ఫైనాన్స్: హౌసింగ్, బిజినెస్, మార్టిగేజ్, పర్సనల్, ఓపెన్ ప్లాట్స్‌పై రుణాలు ఇప్పించబడును. IT రిటర్న్స్ GST లైసెన్స్ చేయబడును. WGL. 9618767116. [SCA25005682]

BUSINESS OFFER

- అధిక ఆదాయం కోసం ఎదురు చూస్తున్నారా! మీ సొంత ఇంటర్ నేషనల్ క్యాపిటల్ మార్కెట్ మీ ట్రేడింగ్ అకౌంట్లో సంపాదించండి. ప్రాఫిట్ షేరింగ్ ఫిక్స్‌డ్ రిటర్న్ సేఫ్ & సెక్యూర్. 6301859174 [SCA25006157]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

WANTED

- Wanted Auto Driver Cum Delivery Boy 5 nos salary 15K+Accommodation & food, Sales Executives 5 nos 18K + Accommodation and food for FMCG Company at Jalpally Preference will be given for scooter owners Hyderabad. Ph: 8367676262, 9885624923, 8978662887 [HA-5441]
- Managers, officers, law/IT officers with experience (including retired) may apply to work in Bhadradri Co-op Urban Bank Ltd, Khammam at various locations. Refer website www.bhadradribank.com. last Dt. 31-7-2025. Ph: 96033 66343 Hr@bhadradribank.com [MH 13721]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.